# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 25 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సర్కారు బడుల్లో 2.56 లక్షల మంది చేరిక

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో 2,56,156 మంది విద్యార్థులు చేరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకటో తరగతిలో 1,07,126 మంది ప్రవేశం పొందారని వివరిం చారు. రెండు నుంచి పదో తరగతి వరకు ప్రయివేటు పాఠశాలల నుంచి సర్కారు బడుల్లో 48,133 మంది, ప్రభుత్వ స్కూళ్ల నుంచి సర్కారు పాఠశాలల్లో 1,00,897 మంది చేరారని తెలిపారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 19,555 మంది, ఆ తర్వాత నిజామాబాద్‌లో 14,807 మంది, వికారాబాద్‌లో 14,684 మంది, సంగారెడ్డిలో 14,215 మంది ప్రవేశం పొందారని వివరించారు. అత్యల్పంగా హన్మకొండలో 1,386 విద్యార్థులు మాత్రమే చేరారని పేర్కొన్నారు. గత విద్యాసంవత్సరంలో సర్కారు బడుల్లో 2,00,901 మంది ప్రవేశాలు పొందితే ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 2,56,156 మంది విద్యార్థులు పొందారని వివరించారు.

# బనకచర్లపై అసెంబ్లీలో చర్చిద్దాం రా..

- అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ లేఖ రాయాలి
- కేసీఆర్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ 18 నెలల పాలనపై ప్రజల ముందు చర్చకు సిద్ధం
- కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను కేసీఆర్ పూర్తిచేయలేదు
- రైతు భరోసా పథకంలో 6 రోజుల్లో రికార్డు పంపిణీ చేశాం
- "నాకు చంద్రబాబుతో ఉండాలనుంటే అక్కడే ఉండేవాణ్ని. కాంగ్రెస్‌లో చేరి ప్రజా ప్రభుత్వం తేవడమే నా లక్ష్యం"
- రైతు నేస్తంలో సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీలో చర్చకు సిద్ధమా? అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. 2016లో గోదావరిలోకి 3 వేల టీఎంసీల నీరు వృథాగా వెళ్తున్నట్లు చెప్పింది మీరే కాదా? అని రేవంత్ నిలదీశారు. రైతు భరోసా విజయోత్సవ సభలో ప్రసంగించిన ఆయన కేసీఆర్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతు భరోసా కింద ఈ నెల 16 వ తేదీన రైతు ఖాతాల్లోకి డబ్బు వేయడం ప్రారంభించినప్పటి నుంచి చెప్పిన మాట ప్రకారం 9 రోజుల్లోగా 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయడం పూర్తయింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 16 వందల రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లక్షలాది రైతులు వీక్షించారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు.

కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చకు స్పీకర్‌కు లేఖ రాయాలని సవాలు విసిరారు. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసినవారు ఎవరో అసెంబ్లీలో చర్చిద్దామని ఆహ్వానించారు. కేసీఆర్ పదేళ్ల పాలన ఎలా ఉందో, కాంగ్రెస్ 18 నెలల పాలన ఎలా ఉందో ప్రజల ముందు చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైన ఏ సాగునీటి ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేయలేదని విమర్శించారు. కాళేశ్వరం కూలేశ్వరమైందని, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, సీతారాం ప్రాజెక్టులు పూర్తి కాకుండా ఆపేశారని దుయ్యబట్టారు.

"నాపై గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారు. నాకు చంద్రబాబుతో ఉండాలనుంటే అక్కడే ఉండేవాణ్ని. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం తేవడానికి కాంగ్రెస్‌లో చేరి కదం కదం కలిపాను," అని సీఎం రేవంత్ అన్నారు. రైతు భరోసా పథకంలో 6 రోజుల్లో రికార్డు స్థాయిలో పంపిణీ చేశామని, లక్షా 4 వేల కోట్లతో రైతులను రాజులుగా మార్చిన ప్రభుత్వమిదని చెప్పారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ పాలనలో కమిషన్లు మాత్రమే వచ్చాయని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై ఎక్కడికక్కడ చర్చ పెట్టాలని సవాలు విసిరారు.

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేంతవరకు ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతూనే ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ. రైతులను రాజులను చేయడమే లక్ష్యంగా పని చేస్తామని పునరుద్ఘాటించారు. "గతంలో చెప్పినట్టుగానే 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఎకరాకు 12 వేల చొప్పున 1 కోటి 40 లక్షల ఎకరాలకు 70 లక్షల రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్న ఈ శుభ సందర్భంగా రైతులందరికీ అభినందనలు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వానికి రైతులు మొదటి ప్రాధాన్యత. ఆ తర్వాత క్రమంలో మహిళలు, తెలంగాణ ఉద్యమకారులైన యువతకు ప్రాధాన్యతనిస్తున్నాం. అందుకే అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే రైతు భరోసా కింద 7,625 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం. వచ్చే పదేండ్లలో వ్యవసాయాన్ని పండుగ చేస్తాం. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో 25,35,964 మంది రైతులకు సంబంధించి 20,617 కోట్ల రూపాయలు చెల్లించి రుణ విముక్తులను చేశాం.

ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు చెల్లించడమే కాకుండా సన్న వడ్లు పండించిన వారికి బోనస్ ఇస్తున్నాం. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలోనే అత్యధిక దిగుబడిని ఇచ్చి గర్వంగా చెప్పుకునే రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టారు. రైతాంగానికి అండగా నిలబడాలన్న లక్ష్యంతోనే రుణ మాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, ఉచిత కరెంట్, స్ప్రింక్లర్స్, డ్రిప్, సోలార్ గిరి వికాసంలో పంపుసెట్లు, సివిల్ సప్లయ్ విభాగం ద్వారా ధాన్యం కొనుగోలు.. ఇలా కేవలం 18 నెలల కాలంలో వ్యవసాయ రంగంపై 1 లక్ష 04 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ప్రజా ప్రభుత్వం ఇది.ప్రజా పాలనలో రైతులు, మహిళలు, యువకుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సోలార్ పవర్ ప్లాంట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, స్కూలు పిల్లల యూనిఫామ్ కుట్టించే బాధ్యత అప్పగించడం, స్వయం సహాయ సంఘాలకు సహాయం... ఇలా కోటి మంది కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టాం.

అధికారం చేపట్టిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాసం ద్వారా యువకులను ఆదుకునే ప్రణాళికలతో ముందుకు వస్తాం. తదుపరి కార్యక్రమంగా రాజీవ్ యువ వికాసం చేపడుతాం. ప్రజా పాలనలో రైతులు, మహిళలు, యువకులు భద్రంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం అన్ని రకాలుగా పోరాడుతాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని కేంద్రానికి ఫిర్యాదు చేశాం. ఒకవేళ కేంద్రం ప్రాజెక్టుకు అనుమతిస్తే న్యాయస్థానాల్లో పోరాడుతాం. బనకచర్లపై కేంద్ర ప్రభుత్వం ముందు రాష్ట్రం తెలిపిన అభ్యంతరాల విషయంలో అసెంబ్లీలో చర్చకు సిద్ధం.. అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, జూపల్లి కృష్ణారావు గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి గారు, హర్కర వేణుగోపాల్ రావు గారు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి గారితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాల్పుల విరమణ... కొన్ని గంటలకే మళ్లీ యుద్ధం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మళ్లీ మొదటికి వచ్చింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన గంటలలోపే సీన్ రివర్స్ అయింది.. ఇరాన్–ఇజ్రాయెల్ ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన కాసేటికే మళ్లీ.. కాల్పులకు సై అంటూ దిగడం.. ఆ రకంగా ప్రకటనలు చేయడం కలకలం రేపుతోంది..

కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇరాన్ దాడులకు దిగింది. ఇజ్రాయెల్ లోని పలు నగరాలపై ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఇరాన్ కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆరోపించింది. దీంతో ఇరాన్‌పై మరిన్ని భీకరదాడులు చేస్తామని ఇజ్రాయెల్ రక్షణశాఖ ప్రకటించింది. బీర్‌షెవాలోని ఓ బిల్డింగ్ మిస్సైల్ దాడిలో కుప్పకూలింది. 9 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ దాడిలో బీర్‌షెవాలో మూడు భవనాలు ధ్వంసమయ్యాయయని ప్రకటించింది. దీంతో ఇజ్రాయెల్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. ప్రజలు బంకర్లలోకి వెళ్లాలని సూచించారు. ఇరాన్‌లో అధికార మార్పిడి జరిగే వరకు దాడులు చేస్తామని ప్రకటించారు.

అయితే ఇజ్రాయెల్ ఆరోపణలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. తాము కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడలేదని స్పష్టం చేసింది. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తరువాత ఎలాంటి దాడులు చేయలేదని వివరణ ఇచ్చింది. ఇజ్రాయెల్‌పై తమకు నమ్మకం లేదని ఇరాన్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రకటించింది. అయితే.. కాల్పుల విరమణను ఆమోదిస్తున్నామని.. శత్రువుపై తమకు అస్సలు నమ్మకం లేదని ఇరాన్ చెప్పింది. తమ వేళ్లు ఇప్పటికీ ట్రిగ్గర్‌పైనే ఉన్నాయని.. చూస్తూ ఊరుకోమంటూ హెచ్చరించింది. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి 'కాల్పుల విరమణ ఉల్లంఘనలకు' ప్రతిస్పందనగా.. ఇరాన్ పై దాడులు చేయాలని ఆదేశించిన తర్వాత ఇరాన్ ఈ ప్రకటన చేసింది.

అంతకుముందు 12 రోజులుగా కొనసాగుతున్న ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముగింపు పలికారు. ఇరు దేశాలు తన మధ్యవర్తిత్వం వల్ల యుద్ధం ఆగిపోయింది.ఇజ్రాయెల్, ఇరాన్‌లు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయని తన ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. దీంతో పశ్చిమాశియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగిసినట్లే అని అందరూ అనుకున్నారు. కానీ అనూహ్యంగా యుద్ధం మళ్లీ మొదలైంది.

## త్వరలో 30 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 56,000 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పూర్తయిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. త్వరలోనే మరో 30,000 ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, సామాజిక న్యాయం ప్రాధాన్యతతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టంచేశారు. నిరుద్యోగులకు త్వరలోనే మరో తీపికబురు అందనుందని భట్టి తెలిపారు. కాంగ్రెస్ అంటే వ్యవసాయం, వ్యవసాయం అంటే కాంగ్రెస్ అని భట్టి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రైతుల సంక్షేమమే తమ ప్రధాన అజెండా అని పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా 69.70 లక్షల మంది రైతుల 1.49 కోట్ల ఎకరాల సాగు భూమికి రూ.9,000 కోట్లను కేవలం 9 రోజుల్లోనే నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఉగాది పండుగ నుంచి ప్రారంభమైన ఉచిత సన్నబియ్యం పథకం ద్వారా 3.10 కోట్ల మంది పేదలకు ఉపశమనం లభించిందని చెప్పారు. ఈ పథకానికి ప్రభుత్వం వార్షికంగా రూ.13,525 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. అలాగే సన్నధాన్యాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించామన్నారు. ఇప్పటి వరకు రూ. 1,199 కోట్ల బోనస్ జారీ చేశామని వెల్లడించారు. రైతు బీమా పథకం ద్వారా 42.16 లక్షల మంది రైతులకు బీమా సదుపాయం కల్పించామని చెప్పారు. ఇది కేవలం ఆర్థిక భరోసానే కాదు, రైతుల పట్ల ప్రభుత్వ బాధ్యతను సూచిస్తుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఈ బడ్జెట్‌లో రూ.23,373 కోట్లు కేటాయించామని తెలిపారు.

పేద కుటుంబాల పిల్లలకు ఉత్తమ విద్య అందించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు భట్టి వివరించారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో ?200 కోట్లతో నిర్మించనున్నామని, మొదటి దశలో 58 పాఠశాలల కోసం ?11,600 కోట్లు కేటాయించామని తెలిపారు. ఈ స్కూల్స్ విద్యారంగంలో మైలురాయిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

'56,000 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పూర్తి. త్వరలో 30,000 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు. రైతు భరోసా ద్వారా ?9,000 కోట్లు 69.70 లక్షల రైతుల ఖాతాల్లో జమ. ఉచిత సన్నబియ్యం పథకం ద్వారా 3.10 కోట్ల పేదలకు లబ్ధి" అన్నారు.

## 275కి చేరిన మృతుల సంఖ్య

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గుజరాత్‌లోని అహ్మదాబాద్ సమీపంలో ఇటీవల జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృతుల సంఖ్య 275కు చేరిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఈ దుర్ఘటనలో మరణించినవారిలో ఎక్కువ మంది విమాన ప్రయాణికులే ఉన్నారని, కొంతమంది స్థానికులు కూడా ప్రాణాలు కోల్పోయారని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- లక్షకు పైగా ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ..
- ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఇప్పటి వరకు దాదాపు 3 లక్షల ఇండ్లు మంజూరు చేయగా ఇందులో 2.37 లక్షల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను కూడా అందజేయడం జరిగింది. 1.03 లక్షల ఇళ్లు గ్రౌండింగ్ అయి, వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో సమీక్షించడం జరిగింది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 22,500 కోట్ల రూపాయలతో నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నెల 23వ తేదీ వరకు గ్రేటర్ హైదరాబాద్ (జిహెచ్ఎంసి) మినహా రాష్ట్రంలోని 95 నియోజకవర్గాలకు గాను 88 నియోజకవర్గాలలో లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ పూర్తయింది. వర్షాకాలం సీజన్ ను దృష్టిలో పెట్టుకొని గ్రౌండింగైన ఇండ్లను వీలైనంత త్వరగా బేస్మెంట్ పనులు పూర్తి చేసుకునేలా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులకు సూచించడం జరిగింది.

ఇండ్ల మంజూరు,గ్రౌండింగ్ లో సూర్యాపేట, పెద్దపల్లి,భూపాలపల్లి,హనుమకొండ,వికారాబాద్, సిద్దిపేట, నారాయణపేట,జోగులాంబ గద్వాల జిల్లాల పనితీరు మరింత మెరుగు పడాలని, తక్షణమే ఆయా జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఒక్కో ఇంటి కోసం 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఈ ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో లబ్ధిదారులు పొందే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని బట్టి లబ్దిదారులకు ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నాం. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నాలుగు విడతల్లో ఇందిరమ్మ లబ్దిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలోని జమ చేస్తున్నాం. బేస్మెంట్ పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత 1లక్ష25 వేలు, స్లాబ్ పూర్తయిన తర్వాత 1లక్ష75 వేలు, మిగిలిన పనులు పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు విడుదల చేస్తున్నాం. ఇంటి స్థలాలు లేని అర్హత కలిగిన లబ్దిదారులకు ఇప్పటి వరకు కేటాయించని 2బీహెచ్‌కే ఇండ్లను కేటాయించి, అలాగే మొండి గోడలతో ఉన్న 2బీహెచ్‌కే ఇండ్లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే పూర్తి చేసుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే అందిస్తుంది. ప్రధానంగా 2బీహెచ్‌కే అసంపూర్తిగా ఉన్న జీహెచ్ఎంసి, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించడం జరిగింది.

## మంత్రిగా ఉన్నప్పుడే నా ఫోన్ ట్యాపింగ్

- ఎంపీ ఈటల రాజేందర్



బలగం టీవీ, హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సాక్షిగా మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సిట్ విచారణకు మంగళవారం హాజరయ్యారు. విచారణ అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ చేయడం వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించడమే అన్నారు. హుజురాబాద్ ఉపఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాప్ చేశారని అన్నారు. తన ఫోన్ అనేకసార్లు ట్యాపింగ్ అయ్యిందని చెప్పారు. నాయకుల ఫోన్లను మాత్రమే కాకుండా వారి గన్ మెన్‌ల ఫోన్‌లను కూడా ట్యాప్ చేశారన్నారు. 2018లో తాను ప్రభుత్వంలో ఉన్నప్పుడే తనను ఓడించే ప్రయత్నం జరిగిందన్నారు. 2021 ఉప ఎన్నికల సమయంలో 2021లో హుజురాబాద్ బై ఎలక్షన్ సమయంలో తాను ఏ కార్యకర్తతో మాట్లాడితే వాళ్ల ఇంటికి వెళ్లి పదవులు డబ్బులు ఆశచూపి ఓడించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. 2023లో గజ్వేల్‌లో, హుజురాబాద్‌లో పోటీ చేసినప్పుడు తమ ఫోన్లు ట్యాప్ చేశారన్నారు.ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం అక్రమం అని చెప్పారు. తనకు అనుకూలంగా ఉన్నవాళ్లను కేసీఆర్ అప్పట్లో నియమించుకున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఇంకా ఎంతకాలం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిందితులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని అడిగారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై కమిటీలు వేస్తున్న ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎందుకు నివేదికలను బయటపెట్టడంలేదని అడిగారు. కాళేశ్వరం కమిషన్ ఏర్పాటు, ఫోన్ ట్యాపింగ్ విచారణ చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా విచారణ నత్తనడకన నడుస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందాల వల్లనే విచారణ ముందుకు పోకపోవడానికి కారణమని ఈటల ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాకపోతే తాము సిబిఐ విచారణ జరిపించి దోషులకు శిక్ష పడే విధంగా చేస్తామని ఈటల సవాల్ చేసారు.

## భవిష్యత్తు సవాళ్లకు సిద్ధంగా ఉండండి

- సీఎం రేవంత్‌రెడ్డి
- పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భవిష్యత్తులో అనేక సవాళ్లు ఎదురుకానున్న నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్ల అమలు, జమిలి ఎన్నికల నిర్వహణ వంటి కీలక పరిణామాలు సమీప భవిష్యత్తులో ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన పార్టీ నేతలకు వివరించారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా చేరవేయడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారని తెలిపారు. త్వరలో మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని సీఎం స్పష్టంచేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నిక కోసం పార్టీ శ్రేణులు ఇప్పటినుండే కృషి ప్రారంభించాలని సూచించారు.

"మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ కమిటీలను పటిష్ఠంగా ఏర్పాటు చేయాలి. పార్టీ నాయకులు ప్రజలతో మమేకమై పనిచేయాలి. పనితీరు ఆధారంగా పదవులు దక్కుతాయి. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన వారికి ఇప్పటికే పదవులు ఇచ్చాం. భవిష్యత్తులోనూ వారికే ప్రాధాన్యం ఉంటుంది" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైతే తాను కూడా గ్రామాల్లో పర్యటించేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి అన్నారు. పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయంతో ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తామని పునరుద్ఘాటించారు.

## వేములవాడలో ఆధునిక గోశాల నిర్మించాలి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం పరిధిలో ఆధునిక గోశాల నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ సమీపంలోని మరిపెల్లి గ్రామంలో గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్టు ఆయన ముఖ్యమంత్రికి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి గారిని ఆది శ్రీనివాస్ కలిసిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి సహ పలువురు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

## రైతులకు క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే హరీష్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు రూ.15,000 చొప్పున ఇస్తామని చెప్పి రూ.12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని, గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే అని పేర్కొన్నారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత అని విమర్శించారు.

## నేడు తెలంగాణ లా సెట్, పీజీ లా సెట్ ఫలితాలు విడుదల..

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో యూనివర్సిటీలు, కాలేజీల్లో లా కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించిన టీజీ లాసెట్ మరియు పీజీ లాసెట్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేయనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఫలితాలను రిలీజ్ చేయనున్నట్లు లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా లాసెట్ పరీక్షలు నిర్వహించారు. ఇటీవలే ప్రిలిమినరీ కీని విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. రేపు సాయంత్రం ఫైనల్ కీతో పాటు ర్యాంకు కార్డులను అఫిషియల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

## ఇసుక ట్రాక్టర్ యజమానులతో ఎంపీడీవో సమావేశం..

- **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సహకరించాలి**
- **లబ్ధిదారుల వద్ద అధిక రేటు వసూలు చేస్తే కఠిన చర్యలు**
- **ఎంపీడీవో జయశీల**

**బలగం టీవీ, బోయినిపల్లి**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక ట్రాక్టర్ యజమానులు సహకరించాలని ఎంపీడీవో జయశీల సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామానికి చెందిన ఇసుక వాహన యాజమానులతో ఎంపీడీవో జయసింహ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయశీల మాట్లాడుతూ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని అతి నిరుపేదలై యుండి, పక్కా గృహం లేకుండా అర్హత పొందిన లబ్దిదారులకు ఇంటి నిర్మాణమునకై విడతల వారిగా మార్కెట్ ధర కంటే కొంత మేరకు తగ్గించి విక్రయించాలని కోరారు. దూర ప్రాంతాలకు సంబంధించిన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామం నుండి మల్కాపూర్ అనంతపల్లి, కోరెం దుండ్రపల్లి గ్రామాలకు ఆరు క్యూబిక్ మీటర్లు ఇసుకకు ట్రాక్టర్ ఒక్కో ట్రిప్పుకు 3000 రూపాయలు, దగ్గర ఉన్న గ్రామాలకు వెంకట్రావుపల్లి, కొత్తపేట,మల్లాపూర్ మరియు మానువాడ గ్రామాలకు లబ్ధిదారులకు సరిపోయే విధంగా తక్కువ ధరకు ఇసుకను విక్రయించాలని, మిగిలిన 15 గ్రామపంచాయతీలకు ఒక్కొక్క ట్రిప్పుకు (గ్రామాలకు) ఒక్కంటికి 2000 రూపాయలకు ఇసుకను విక్రయించాలని అన్నారు.ఇట్టి ధరలను అతిక్రమించి, విక్రయించిన ట్రాక్టర్ యాజమాన్యంపై తగు చర్యలకు పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇసుక ట్రాక్టర్ యజమానులు సహకరించాలని కోరారు.




## పది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సత్కారం..

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సింగపూర్ లో మంగళవారం రోజున చంద్ర ఎడ్యూకేషన్ సొసైటి చైర్మన్ రామరాజు ఆద్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకు ఎస్. నందిని, ఆర్. అభినవి మొదలగు విద్యార్థులకు మరియు పాఠశాల యాజమాన్యంకు షీల్డ్, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.రాజ్ కుమార్ మాట్లాడుతూ: ప్రభుత్వ పాఠశాలలలో చక్కని విద్యనందిస్తూన్నారని, మెరుగైన ఫలితాలు వస్తున్నాయని, పిల్లలు పట్టుదలతో చదివి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని అలాగే పిల్లలు డ్రగ్స్ కు అలవాటు పడవద్దని గుట్కాలు, మందు, సిగరేట్ లు మొదలగు వాటికి దురంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని వారు కోరారు. మండల విద్యాధికారి ఎన్. శ్రావణ్ కుమారు మాట్లాడుతూ: ప్రభుత్వ బడులలో డిజిటల్ విద్యను అందిస్తున్నారని, విద్యార్థులందరు ప్రభుత్వ బడులలో చేరి, బడులను బలోపేతం చేయాలని, పిల్లల తల్లిదండ్రులు అన్ని విదాలా సహకరించి, మన ఊరి ప్రభుత్వ బడులకే పిల్లలను పంపించే విదంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్ర ఎడ్యూకేషన్ సోసైటి చైర్మన్ సి.రామరాజు, డి.శ్రీహరి మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గోన్నారు.

## పాకెట్ పాలు పగిలాయని పోలీసులకు ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్**



పాలు పగిలాయని ఫిర్యాదు చేయగా కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రత్నదీప్ సూపర్ మార్కెట్లో హెరిటేజ్ పాలను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చి కాచిన మొదటి ప్యాకెట్ బాగానే ఉంది. మరో ప్యాకెట్ ఉదయం కాచేసరికి పగిలిపోయాయి అసలు ఏంటి అని ప్రశ్నించగా వాళ్లకి తాము ఏమి చేస్తాం అంటూ దుకాణదారుడు జవాబు ఇచ్చాడు. దాంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా కేవలం ఒక సంస్థ నుండి వచ్చే పాలే కాకుండా ఈ మధ్యకాలంలో పలు సంస్థల పాలు పగులుతున్నాయి. వీటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ఎంతో మంది కస్టమర్లు కోరుతున్నారు.

# బీసీ రిజర్వేషన్లపై ఉద్యమానికి సీపీఐ(ఎం) మద్దతు

- **ఎమ్మెల్సీ కవిత, జాన్ వెస్లీ భేటీ..**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో భేటీ అయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై జూలై 17న చేపట్టనున్న రైల్ రోకో కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత జాన్ వెస్లీని కోరారు. ఎమ్మెల్సీ కవిత చేస్తున్న బీసీ ఉద్యమానికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం గత రెండేళ్ళుగా ఉద్యమిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఆమోదించిందని, అయితే రాష్ట్రపతి ఆమోదానికి బిల్లు మూడు నెలల క్రితమే వెళ్లినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని, ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్ సెంచరీ చేసినా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీతో ఈ అంశంపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే ఉద్యమబాటనే మార్గమని, జూలై 17న రైల్ వ్యవస్థను స్తంభించే విధంగా రైల్ రోకో చేపట్టబోతున్నామని వెల్లడించారు. కలిసివచ్చే భావసారూప్యత గల శక్తులన్నింటినీ మద్దతు కోసం కలుస్తున్నామని, ఉద్యమాలకు పేరెన్నికగల సీపీఎం పార్టీ నాయకులను కూడా కలిశామని తెలిపారు. బిల్లు ఆలస్యమైతే బీసీలు ఉద్యోగులు, విద్యార్థులు రిజర్వేషన్లలో వాటాను కోల్పోతారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

జాన్ వెస్లీ మాట్లాడుతూ, బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఉద్యమానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన డిమాండ్ అని, సామాజిక న్యాయం కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. రిజర్వేషన్లను పెంచి అసమానతలను తొలగించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. బీజేపీ సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉంటుందని, మొన్నటి వరకు కులగణనను కూడా బీజేపీ పార్టీ వ్యతిరేకించిందని, ప్రజా ఉద్యమాలకు తలొగ్గి కులగణన చేయడానికి ముందుకు వచ్చిందని విమర్శించారు. రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర బీజేపీ నాయకులు నోరు విప్పడం లేదని, 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై ఒత్తిడి చేసే బాధ్యత బీజేపీ నాయకులపై కూడా ఉందని జాన్ వెస్లీ అన్నారు. కేవలం కేంద్రానికి వినతి పత్రాలు అందించే వరకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పరిమితం కావద్దని, అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి తీసుకోవాలని సూచించారు.

## ఐఏఎస్ ఆమ్రపాలిని మళ్లీ తెలంగాణకు కేటాయింపు

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను ఆంధ్రప్రదేశ్ కేడర్ నుండి తిరిగి తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ క్యాట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామంతో ఆమె త్వరలోనే తెలంగాణ ప్రభుత్వంలో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమ్రపాలి దాదాపు నాలుగు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు వెళ్లారు. అయితే, దీనిని సవాల్ చేస్తూ, తనను తెలంగాణకు కేటాయించాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై విచారణ జరిపిన క్యాట్, ఇరుపక్షాల వాదనలు విన్నది. అనంతరం, ఆమ్రపాలి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ ఆమెకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.

# బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లాలి

- **ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కృష్ణా జలాలను తరలించి అన్యాయం చేసినట్టుగానే గోదావరిని తరలించుకెళ్ళేందుకు ఆంధ్రా సర్కార్ కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. అడ్డుకోవాల్సిన రేవంత్ రెడ్డి చోద్యం చూస్తూ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. బనకచర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. చంద్రబాబు మాయలో పడి రేవంత్ రెడ్డి ఏపీకి నీళ్లు తరలిస్తుంటే అభ్యంతరం చెప్పడం లేదన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు భాస్కరరావు, రవీంద్ర కుమార్, మెతుకు ఆనంద్‌తో కలిసి జగదీశ్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరిపై ట్రిబ్యునల్ ఏర్పాటు కాకముందుకే జలాలపై హక్కులు సాధించుకునేందుకు ఏపీ సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.. గోదావరి నీటిని కృష్ణా మీదుగా ఆంధ్రకు తరలించే అవకాశాన్ని వదిలిపెట్టి%ా% రూ. 80 వేల కోట్లతో బనకచర్లను నిర్మించి తెలంగాణకు శాశ్వతంగా అన్యాయం చేసేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు.. లేని మిగులు జలాల కోసం ఆరాటపడుతూ తెలంగాణను ఎండబెట్టేందుకు కుతంత్రాలు చేస్తున్నారని నిప్పులు చెరిగారు. నిలువరించాల్సిన రేవంత్ రెడ్డి గురుదక్షిణగా ఆయనకు దాసోహం అవుతున్నారని ఆరోపించారు. అందుకే అపెక్స్ కౌన్సిల్‌లో మాట ఎత్తకుండా చంద్రబాబుతో చర్చల పేరిట సంధి కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే అన్ని పార్టీలను కలుపుకొని పోరాటం చేయాలని హితవు పలికారు.

బనకచర్ల విషయంలో ఆంధ్రకు చెందిన ఓ మీడియా వర్గం తెలంగాణ పార్టీల మధ్య పంచాయతీ పెడుతున్నదని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఈ ముసుగులో గోదావరిని ఆంధ్ర ప్రాంతానికి తరలించే బాబు యత్నానికి మద్దతు పలుకుతున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ, బిజెపి నాయకులు వారి ఉచ్చులో పడవద్దని సూచించారు. బనకచర్లపై అందరం ఏకమై కొట్లాడుదామని పిలుపునిచ్చారు. గోదావరి కావేరి లింకు ముగిసిన అధ్యాయం అని వ్యాఖ్యానించారు. గతంలో చత్తీస్గఢ్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. కానీ తెలంగాణ చెందిన బిజెపి ఎంపీలు సోయి లేకుండా చంద్రబాబు మేలు కోసం మాట్లాడుతున్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా అవగాహన పెంచుకొని తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టవద్దని డిమాండ్ చేశారు. బనకచర్లపై పోరాట విషయంలో బీఆర్ఎస్ అన్ని పార్టీలతో కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు. ఈ దిశగా ప్రభుత్వం కార్యాచరణ తీసుకోకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు రైతుబంధును ఎగ్గొట్టిందని రుణమాఫీ చేయకుండా మోసం చేసిందని జగదీశ్ రెడ్డి దుయ్యబట్టారు. కానీ ఇప్పుడు రైతులకు ఏదో ఉద్ధరించామని సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. రైతుబంధు కొట్టినందుకు రుణమాఫీ పేరా మోసం చేసినందుకు రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.. ప్రభుత్వం రైతులకు లక్ష కోట్లు సాయం చేశాం అనడం దుర్మార్గమన్నారు.. ప్రభుత్వం సాయం చేసింది అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టులు నిర్వహించే మంత్రులకేనని ఎద్దేవా చేశారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

**-డ్రగ్స్ తో నష్టాల పై విస్తృత ప్రచారం కల్పించాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎస్పీ మహేష్ బి గీతే , సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది వస్త్ర పరిశ్రమ కార్మికులు మద్యానికి బానిసై అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఇలా జరగకుండా స్థానిక కౌన్సిలర్ ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ను ఆదేశించారు.

జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గీతే ,మాట్లాడుతూ జిల్లాలో వారం రోజుల వరకు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యార్థులకు , యువతకు, ప్రజలకు ,విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు.విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటి దశలోనే కట్టడి చేయాలని, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలనిఅన్నారు. అనంతరం జాగ్రత్త!! మాదక ద్రవ్యాలు..మీ జీవితాన్ని నాశనం చేస్తాయి...డ్రగ్స్ కు నో చెప్పండిలి అనే పోస్టర్లు రిలీజ్ చేశారు.

ఐ యాం యాంటీ డ్రగ్ సోల్జర్స్ అనే పోస్టర్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి అందరూ ఐ యాం యాంటీ డ్రగ్ సోల్జర్స్ గా నమోదు చేసుకొని మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ సమావేశంలో డీఎం హెచ్ ఓ రజిత, డీఏఓ అఫ్జల్ బేగం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో బోధనేతర పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**-మహిళా అభ్యర్థులు సంబంధిత మండలాల్లో దరఖాస్తు చేసుకోవాలి**

**-డీఈఓ వినోద్ కుమార్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

జిల్లాలోని పలు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బోధనేతర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వినోద్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బోయిన్ పల్లి కేజీబీవీలో హెడ్ కుక్ (1), చందుర్తి కేజీబీవీలో నైట్ వాచ్ ఉమెన్(1), ముస్తాబాద్ కేజీబీవీలో అటెండర్ (1), రుద్రంగి. కేజీబీవీలో అసిస్టెంట్ కుక్(1),వేములవాడ రూరల్ కేజీబీవీ మర్రిపల్లిలో అసిస్టెంట్ కుక్(1), ఎల్లారెడ్డిపేట కేజీబీవీ అల్మాస్పూర్ లో అసిస్టెంట్ కుక్ (1), బోయిన్పల్లి టీజీఎంఎస్ బాలికల హాస్టల్ లో అసిస్టెంట్ కుక్ (2), ఇల్లంతకుంట టీజీఎంఎస్ బాలికల హాస్టల్ లో వాచ్ ఉమెన్(1), కోనరావుపేట టీజీఎంఎస్ బాలికల హాస్టల్ లో అసిస్టెంట్ కుక్(1) ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు తమ తమ మండల కేంద్రాల్లోని విద్యా వనరుల కేంద్రాల్లో ఈ నెల 25 వ తేదీ నుంచి 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

# రైతు భరోసా ద్వారా 1,24,292 మంది రైతులకు రూ.145 కోట్ల లబ్ది..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల**

జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా పథకం కింద రూ. 145 కోట్లకు పైగా డబ్బులు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఖరీఫ్ వానాకాలం సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోజు వరకు జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 1,24,292 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.145,24,03,068క్ష్మ 00 డబ్బులు జమ అయ్యాయని పేర్కొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి...

**- ఎస్సై రాజకుమార్**

**బలగం టీవీ, బోయినిపల్లి**




యువత మత్తు పదార్థాలు వాడితే జీవి తం అంధకారమవుతుందని ఎస్సై రాజకుమార్ పేర్కొన్నారు. మంగళవారం బోయినిపల్లి మండలం కొదురుపాక, నర్సింగాపూర్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత మత్తు మందు వాడడం వలన శరీరంలో తెలియని మార్పులు చోటు చేసుకొంటాయన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశలోనే మత్తు బానిస అవుతారని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలపై అవగాహ పెంచుకొని గ్రామాల్లోని ప్రజలకు వాటి పరిస్థితి గురించి వివరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తాత్కాలిక ఆనందానికి లక్ష్యం చేజార్చుకోవద్దు.

**- డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**- అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి**

**బలగం టీవీ,వేములవాడ**




తాత్కాలిక ఆనందానికి అలవాటు పడి లక్ష్యం చేజార్చుకోవద్దనీ వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల, మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా సంక్షేమ శాఖ, నషా ముక్తా భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదక ద్రవ్యాల నివారణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్పి శేషాద్రిని రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని,పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, ఉద్యోగం రావడం లేదని, మనసుకు బాధ కలిగిందని, చెడు స్నేహితుల వల్ల ఒక్కసారే ప్రయత్నించు అనే సలహాతో డ్రగ్స్ అలవాటు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సందర్భంలో వ్యాధి నయం అవుతుందని డ్రగ్స్ విక్రేయదారులు ఉచితంగా డ్రగ్స్ ఇచ్చి అలవాటు చూపిస్తారని, తద్వారా సులభంగా డబ్బు సంపాదించవచ్చని,వ్యాపారం చూపిస్తారనిఅన్నారు. ఇలాంటి మాటలకి లొంగిపోకుండా మంచిగా చదువుకొని మంచి ఉద్యోగంలో స్థిరపడి కుటుంబానికి దేశానికి మంచి తీసుకురావాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు కావోద్దంటే అధిక సమయం పుస్తకాల ను చదవాలన్నారు. గొప్ప లక్ష్యంతో చదివితే ఉన్నతస్థాయి అధికారులు అవుతారనిఅన్నారు. హాస్టల్ లో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని,ఇంటికి వెళ్లినప్పుడు చెడు వ్యసనాలకు అలవాటు కావొద్దనిఅన్నారు. అనంతరం రెండు పాఠశాలలోనీ మైదానంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఎండబ్ల్యుఓ భారతి , ఎస్సీ కార్పొరేషన్ అధికారిని స్వప్న, జిల్లా ఉమెన్ ఎంపొవర్మెంట్ అధికారిని రోజా, ఐసిపిఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్స్ రాజయ్య, కుమార స్వామి, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ జనార్దన్ సైలెంట్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# రైతు భరోసా సంబరాల

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మండల రైతులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మరియు చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యంల చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు.9 రోజుల్లో 9,000 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఎకరానికి 6000 చొప్పున తొమ్మిది రోజులలో 9000 కోట్లను రైతుల ఖాతాల్లో వేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, జిల్లా బీ.సీ. సెల్ అధ్యక్షులు కూస రవీందర్,సెస్ డైరెక్టర్ కొట్టేపల్లిసుధాకర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు పులి లక్ష్మీపతి గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండి బాబు,మెరుపుల మహేష్, బాలగోని వెంకటేష్,జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎనుగుల కనకయ్య, జంగం అంజయ్య, కట్ట లచ్చయ్య, మండల కాంగ్రెస్ నాయకులు పిట్టలరమేష్,నాగుల వంశీ మొండయ్య,రఫిక్, నజీర్, మమ్మద్, పెంతల మహేందర్, మండల కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల హామీలు అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో జిమంగళవారం రోజున ల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కి రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ వెంగళ శ్రీనివాస్ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ల్లా కలెక్టర్ కి ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని అన్నారు. సంక్షేమ పథకాలలో ఇందిరమ్మ ఇండ్లలో రాజీవ్ యువ వికాస పథకంలో 20% శాతం తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 10,000 రూపాయల కోట్లు బడ్జెట్ కేటాయించాలని, తెలంగాణ రాష్ట్ర సాధకులుగా గౌరవించి నెలకు 25 వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని, ఉద్యమకారులకు ప్రమాద బీమా ఐదు లక్షలు అందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కళాకారుల విభాగం నాయకులు ఎల్ల పోశెట్టి, ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు బొజ్జ కనకయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు వెంగళ వెంకటేశం, బొడ్డు రాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లీడ్స్ టెస్టులో భారత్‌కు పరాజయం



- **ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సిరీస్‌లో 1-0 ఆధిక్యం**
- **371 రన్స్ టార్గెట్ చేజింగ్ చేసిన ఇంగ్లాండ్**
- **బెన్ డకెట్ (149) అద్భుత శతకం**

**బలగం టీవీ, లీడ్స్**

ఇంగ్లాండ్ పర్యటనలో భారత క్రికెట్ జట్టుకు తొలి టెస్టులో నిరాశ ఎదురైంది. లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టు 5 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. 371 పరుగుల భారీ విజయలక్ష్యాన్ని ఇంగ్లాండ్ జట్టు 82 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

371 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్‌కి ఓపెనర్లు జాక్ క్రాలీ (65, 126 బంతుల్లో 7 ఫోర్లు), బెన్ డకెట్ (149, 170 బంతుల్లో 21 ఫోర్లు, 1 సిక్సర్) అద్భుతంగా ఆరంభం అందించారు. వీరిద్దరూ కలసి 188 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. క్రాలీ అవుటైన తర్వాత ఓలీ పోప్ (8) త్వరగానే వెనుదిరిగాడు. డకెట్ మరియు హ్యారీ బ్రూక్ (0) వరుసగా పెవిలియన్ చేరినా జో రూట్ (53 నాటౌట్, 84 బంతుల్లో 6 ఫోర్లు), జామీ స్మిత్ (44 నాటౌట్, 55 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు) విజయం ఖరారు చేశారు.

భారత జట్టు బౌలర్లు నిర్దిష్ట సమయంలో వికెట్లు తీయడంలో విఫలమయ్యారు. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా ఓ వికెట్ పడగొట్టాడు . మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 471 పరుగులు సాధించగా, ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 364 పరుగులు మాత్రమే చేసి పరిమితమైంది.

ఈ గెలుపుతో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్ట్ జూలై 2న బర్మింగ్‌హామ్ వేదికగా ప్రారంభం కానుంది. కీలక క్యాచ్‌లు వదిలేయడం టీమిండియా కొంపముంచింది. తొలి ఇన్నింగ్స్‌లో 5 క్యాచ్‌లు వదిలేసిన భారత ఆటగాళ్లు.. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు క్యాచ్‌లు అందుకోలేకపోయారు. ఈ ఓటమితో యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్‌తో పాటు రిషభ్ పంత్ సాధించిన రెండు శతకాలు వృథా అయ్యాయి. ఈ మ్యాచ్‌తోనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఎడిషన్ ప్రారంభమవ్వగా.. టీమిండియా ఓటమితో మొదలెట్టింది.

లక క్యాచ్‌లు వదిలేయడంతో పాటు లోయరార్డర్ వైఫల్యం తమ ఓటమిని శాసించిందని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్ తమ ఓటమికి గల కారణాలను తెలిపాడు. ఇంగ్లండ్ ముందు 430 పరుగుల లక్ష్యాన్ని ఉంచాలనుకున్నామని, కానీ 25 పరుగుల వ్యవధిలోనే చివరి వికెట్లు కోల్పోయామని చెప్పాడు. ఈ తప్పిదాల నుంచి గుణ పాఠం నేర్చుకొని తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతామని తెలిపాడు.ఏఆఖరి రోజు కూడా తొలి వికెట్ తీసిన తర్వాత మాకు విజయవకాశాలు ఉన్నాయని భావించాను. కానీ మేం ఆశించిన రీతిలో ఆట సాగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలడం గురించి మేం చర్చించుకున్నాం' అన్నారు.





# మాజీ క్రికెటర్ దిలీప్ దోషి కన్నుమూత

**బలగం టీవీ, ముంబై**

టీమిండియా మాజీ క్రికెటర్, ఆఫ్ స్పిన్నర్ దిలీప్ దోషి(77) కన్నుమూశారు. లండన్‌లో ఆయన గుండె సంబంధిత వ్యాధితో మరణించారు. కొన్ని దశాబ్దాల నుంచి ఆయన లండన్‌లోనే నివాసం ఉంటున్నారు. టీమిండియా తరపున 33 టెస్టులు ఆడిన దిలీప్.. 114 వికెట్లు తీసుకున్నాడు. అయిదేసి వికెట్లు అతను ఆరు సార్లు తీసుకున్నాడు. 15 వన్డేల్లో అతను 22 వికెట్లు తీసుకున్నాడు. సౌరాష్ట్ర, బెంగాల్, వార్‌విక్‌షైర్, నాటింగ్‌హామ్‌షైర్‌కు అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. 1970 దశకంలో ఉన్న మేటి స్పిన్నర్ల దారిలో దిలీప్ దోషి ముందుకు సాగాడు. అతను 32 ఏళ్ల వయసులో టెస్టు అరంగేట్రం చేశాడు. నాటింగ్‌హామ్‌షైర్‌లో లెజండరీ గ్యారీఫీల్డ్ సోబర్స్‌తో కలిసి ఆడేవాడు. 1980 దశకంలో అతను స్వల్ప సమయంలోనే క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. ఆ దశలో ఇండియన్ క్రికెట్ నడుస్తున్న తీరును ఆయన ఇష్టపడలేదు. స్పిన్ పంచ్ పేరుతో ఆటోబయోగ్రఫీ బుక్ రాశాడతను. దాంట్లో క్రికెట్ అనుభవాల గురించి చెప్పాడు.

# పంత్‌కు ఒక డీమెరిట్ పాయింట్

**బలగం టీవీ, ముంబై**




ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో రిషబ్ పంత్ అద్భుతంగా రాణించాడు. రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించి.. ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే తాజాగా అంపైర్లతో వాగ్వాదం చేసినందకు అతనికి ఐసీసీ ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. తొలి ఇన్నింగ్స్ 61 ఓవర్‌లో బంతిని మార్చాలని పంత్ ఫీల్డ్ అంపైర్ పాల్ రైఫిల్‌ని అడిగాడు. బంతి కండీషన్ బాలేదని.. ఇంకో బంతి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు. కానీ, అంపైర్ బంతిని పరిశీలించి దాన్ని మార్చాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. దీంతో సహనం కోల్పోయిన పంత్ బంతిని నేలకేసి బలంగా కొట్టాడు. దీంతో అంపైర్లు మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్‌కు ఫిర్యాదు చేశారు. పంత్ కూడా తన తప్పును అంగీకరించడంతో పంత్‌కు ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.8ని ఉల్లంఘించినందుకు ఐసిసి ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. గత 24 నెలల్లో ఇదే తొలి తప్పిదం కావడంతో కేవలం ఒక డీమెరిట్ పాయింట్‌తో సరిపెట్టింది.

# ‘కన్నప్ప’ సెన్సార్ పూర్తి..



**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు విష్ణు ప్రధాన పాత్రలో తెరకెక్కిన ‘కన్నప్ప’ ఈ నెల 27వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. 195 నిమిషాల నిడివితో రూపొందిన ఈ సినిమాని సెన్సార్ బోర్డు 182(3 గంటల 2 నిమిషాలు) నిమిషాలకు కుదించింది. సెన్సార్ బోర్డు సినిమాలో 12 కట్స్ చెప్పింది. అందులో రాబందు ఓ చిన్నారిని పై నుంచి పడేయటం. తిన్నడుకు సంబంధించిన కొన్ని సీన్లు, మూడు పాటల్లోని విజువల్స్‌ని తొలగించారు. ఇక బుధవారం నుంచి సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ (తెలుగు) ప్రారంభం అవుతాయని మంచు విష్ణు ఎక్స్ ద్వారా వెల్లడించారు. ఇక ఈ సినిమాను ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా.. మోహన్ బాబు నిర్మించారు. ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ బాబు, శరత్ కుమార్, మోహన్ లాల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాను పెంచేశాయి.




# ‘షో టైమ్’ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ యువ నటుడు నవీన్ చంద్ర, పోలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ‘షో టైమ్’. ఈ సినిమాకు మదన్ దక్షిణామూర్తి దర్శకత్వం వహిస్తుండగా.. నరేష్, రాజా రవీంద్ర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ప్రజెంట్ చేస్తున్నారు. ట్రయిలర్ చాలా ఆసక్తికరంగా సాగుతోంది. ముఖ్యంగా ఒక మర్డర్ చుట్టు అల్లుకున్న కథ అని ట్రయిలర్ చూస్తే అర్థం అవుతుంది. ఈ చిత్రం థ్రిల్ ను పంచడంతో పాటు ఆద్యంతం కామెడీతో అలరించబోతుందని అర్థం అవుతుంది. ఇక కోర్ట్ రూమ్ డ్రామా, పోలీస్ ఇన్విస్టిగేషన్ సీన్లతో ఊపిరి బిగపట్టి చూసే ఆసక్తికరమైన సన్నివేశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# చిరంజీవి తల్లి ఆరోగ్యంపై మళ్లీ వదంతులు.. స్పందించిన నాగబాబు

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి మాతృమూర్తి అంజనాదేవి ఆరోగ్యంపై మంగళవారం కొన్ని వదంతులు సామాజిక మాధ్యమాల్లో వచ్చాయి. ఆమె అనారోగ్యానికి గురయ్యారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాబినెట్ మీటింగ్ మధ్యలోనే వెళ్లిపోయారని వార్తలు రావడంతో అభిమానులు, శ్రేయోభిలాషులలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో, ప్రముఖ నటుడు, నిర్మాత నాగబాబు ఈ అంశంపై స్పందించారు. తన తల్లి అనారోగ్యంపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తమ తల్లి చాలా ఆరోగ్యంగా ఉందని ఆయన సోషల్‌మీడియా వేదికగా తెలిపారు. కొన్ని అవాస్తవాలు ప్రచారం జరుగుతున్నాయని.. కానీ, ఆమె చాలా బాగున్నారంటూ ఆయన పోస్ట్ చేశారు. నిరాధారమైన వదంతులను నమ్మవద్దు అని నాగబాబు తన పోస్టులో పేర్కొన్నారు. అయితే అంజనాదేవి గురించి ఇలాంటి వార్తలు రావడం ఇది మొదటిసారి కాదు. గతంలో చాలాసార్లు ఆమె అనారోగ్యానికి గురయ్యారని వార్తలు వచ్చాయి. ఇకసారి చిరంజీవి స్వయంగా ఈ వార్తలను ఖండించారు. అసత్యా ప్రచారాలు నమ్మొద్దని ఆయన సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

# తమ్ముడు” నుంచి ‘జై బగళాముఖీ..’ సాంగ్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**



“సంక్రాంతికి వస్తున్నాం” బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ “తమ్ముడు”. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న “తమ్ముడు” సినిమా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు “తమ్ముడు” సినిమా నుంచి ‘జై బగళాముఖీ..’ లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ‘జై బగళాముఖీ..’ పాటకు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు సాహిత్యాన్ని అందించగా, అజనీష్ లోకనాథ్ డివైన్ ట్యూన్ తో కంపోజ్ చేశారు. సింగర్ అబీ వీ ఆకట్టుకునేలా పాడారు. ‘జై బగళాముఖీ..’ పాట ఎలా ఉందో చూస్తే – ‘ జై బగళాముఖీ, జై శివనాయకీ, జై వనరూపిణీ, జై జయకారిణీ, విద్రుమ రూపిణి, విభ్రమ కారిణి, గగనఛత్ర వింధ్యాచలవాసిని, వీర విహారిణి, క్షుద్ర విదారిణి, సర్వజీవ సంరక్షిణి జననీ’ అంటూ సాగుతుందీ పాట. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి మహిమను కీర్తిస్తూ గ్రామ జాతర వేడుక సందర్భంగా ‘జై బగళాముఖీ..’ పాటను చిత్రీకరించారు.

# హ్యాపీ జర్నీ’ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బండి సంజయ్

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫ్యూచర్ బ్రైట్ ఫిలిమ్స్ పతాకంపై హరిప్రసాద్ కోనే, ఇషాని గోష్ హీరో హీరోయిన్లుగా చైతన్య కొండా దర్శకత్వంలో గంగాధర్ పెద్ద కొండ నిర్మించిన ఎమోషనల్ ఎంటర్‌టైనర్ హ్యాపీ జర్నీ. ప్రస్తుతం షుటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకులు చైతన్య కొండ, నిర్మాత గంగాధర్ పెద్ద కొండ, అరుణ్ కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ “ఇలాంటి మంచి సినిమా చేసిన డైరెక్టర్‌ని అభినందిస్తున్నాను. హిందీ, తెలుగు భాషలలో విడుదల కానున్న ఇలాంటి సినిమాలకు నేను ఎంతవరకైనా సహకరిస్తాను”అని అన్నారు.